# పరిశినాయుడి వొంశం

రామక్రిష్ణంనాయుడూ, నర్శింహులు నాయుడూ అన్నదమ్ములు. ఒకపూట ముందూ వెనకగా పుట్టిన కవలలు. పులీపుట్రా, దుమ్మలగొండీ, నక్కా రాబందూ గ్రద్దా... రామక్రిష్ణనాయుడూ, నర్శింహులు నాయుడూ–సైకిలూ, కలువా!

"మాయన్న నియోజికవర్గాన్ని మాసెడ్డ డెవలప్ జేస్సినాడు. స్కూలు బిల్డింగులు, బస్సెల్టర్లు, బజార్లు, డోక్రా గ్రూపులు, రోడ్లు – వోహో... స్వర్ణాంధ్ర యేదీ అనంటే – యీ నియోజిక వర్గాన్ని సూపించొచ్చు. హంత డెవలప్ జేస్సినాడు.." చేతిలోని గ్లాసు టేబిల్ మీద పెట్టేసి, వొళ్లు విరుచుకొని లేచి, పక్కనున్న సోఫాలో చారబడుతూ, పలికేడు నర్శింహులునాయుడు.

టేబిల్‌చుట్టూ కూర్చున్న మరి ముగ్గురు – ప్లేట్లలోని జీడిపలుకుల్ని తింటూ, "జనానాను..." అనన్నారు.

నర్శింహులునాయుడింకా – వారివేపే చూస్తున్నాడు. నాగావళి నది ఒడ్డునున్న ఆ అతిథి గృహంలోకి చల్లగా వొక్కసారి గాలి వీచింది. డోర్‌కర్టెన్ కదలికల్తో అతిథి గృహం అవతలి రోడ్డువేపు చూస్తోన్న శీనుబాబు చూపు మరల్చి, నర్శింహులు నాయుడ్ని చూస్తూ–

"వోయ్, నారిబాబూ! నీకు తెల్దుగాని, మన బ్రెదరుకెంత నేముందనుకున్నావ్? అటు సెంటర్లగానీ, యిటు స్టేట్‌లగానీ మన బ్రెదర్‌కి 'ఎస్స'నీ వోళ్లే తప్పా 'నో'అనీవోళ్లు లేరు. ఆఁ! అసలకి, మన బ్రెదరు పెర్సనాలిటీ ముందెవుడైనా బలాదూర్! ఇదిగో యిప్పుడంటే యిప్పుడు, కాదా...యెప్పుడైనా సరే – ఎలక్సన్ పెట్టమను. అపోజిసనోళ్లందర్నీ కలిపి వొక్కడ్ని పోటీపెట్టమను. అతగాడికి డిపోజిట్ రాదు! కదర్రా..!" అని మిగిలిన యిద్దర్నీ అడిగేడు. వాళ్లు గ్లాసులోని ద్రవాన్ని మింగుతూ తలూపేరు. అక్కడికి ఎడంవేపు కోలనీలోంచి కుక్కలు గుక్కపట్టి అరిచే అరుపులు! అవి ఆగకముందే, ఎదురుగా నదివొడ్డు రెల్లుపొదల్లోంచి నక్కల ఊలలు!

నర్శింహులునాయుడు చెవులొక్కసారి వేళ్లతో కదుపుకొని, శీనుబాబు వేపు చూసేడు. శీనుబాబు – గంధవరపు శ్రీనివాసరావు. వొక స్టేషనరీ దుకాణం, వొక జూనియర్ కాలేజీ, వొక బార్ అండ్ రెస్టారెంట్‌కి యజమాని. తెల్లటి షర్టూ, ఫ్యాంటూ, తెల్లని ఛాయతో, గంభీరంగా కనబడబోతాడు. గానీ, నీరు నిండిన చెరువులో జనపమావుమీద చేపలకై కాచుకున్న తెల్లటి కొంగలా కన్పిస్తాడు. నవ్వొచ్చింది. సన్నగా నవ్వుకున్నాడు నర్శింహులునాయుడు.

"నవ్వుతాడేటి? డౌటా? సేలంజా? ఇదిగో! యిదే సెప్తన్నాను. బ్రెదరేగాదు, బ్రెదరు యింట్లోని మూలనున్న ముండని నిల్సోబెట్టినా అవతలోల్లికి డిపాజిట్లురావు. వొస్తే నీను బతికినన్నాళ్లూ గుండు గొట్టించుకొని బోడిగుండుతోటి తిరుగుతాను..." అని భీకర శపథం జేసాడు శ్రీనుబాబు.

తెల్లటి బోడికొంగనోసారి వూహించుకొని, నవ్వాపుకున్నాడు నర్శింహులునాయుడు. గానీ, మనసులో ఆలోచనలు మాత్రం ఆపుకోలేదు.

'డౌటు లేదు, అనుమానమసలక్కర్లేదు. ఎలాగూ, యిక, యేదోవొకనాడు ఆ అన్నగాల్లు తప్పకుండా తన అన్నని ఖతం జేసేస్తారు. ఖాయిం! అలాపింటి పన్లు జేసాడన్న. ఖతం జెయ్యక సస్తారేటి అన్నగాళ్లు? సేసిసస్తారు! ఆఁ! ఆ తర్వాత, మూలనున్న ముండగాదు- తనే నిలబడతాడు. గెలుస్తాడు. అన్నకి దొరకని మంత్రి పదవిని తను దొరకబుచ్చు కుంటాడు. యింతకంటా మా సెడ్డ డెవలప్ జేసేస్తాను నియోజికవొర్గాన్ని! డౌట్ లేదు' అని మనసులో ధృవపర్చుకున్నాడు నర్శింలునాయుడు.

వొకానొక రాత్రి ఆ ప్రభుత్వ అతిథి గృహంలో ఆ విధంగా నర్శింహులునాయుడు మూడోరౌండు పూర్తయ్యేక మూడుసార్లు మనసులో 'డౌట్‌లేదు!' అని నిర్థారించుకుని, మునుపెన్నడు లేనంత ఆనందంగా వున్నాడు. గంధవరపు శీనుబాబెలాగూ రెండో రౌండు నుండే పొంగిపోతున్నాడు. మూడోవాడు సాసుబిల్లి విశ్వనాథం మూడు రౌండ్లూ కూల్‌డ్రింకెక్కువా మందు తక్కువా తాగేడు. విశ్వనాథంకి పక్కవాడ్ని మత్తెక్కించటం యిష్టం. ఇక నాలుగోవాడు జర్నలిస్టు జగన్నాథం! 'కూల్‌డ్రింక్ యెపుడైనా తాగొచ్చు- అసలు డ్రింక్ యిలాటపుడే సాధ్యమైనంత యెక్కువ తాగా'లన్న దృఢాభిప్రాయం గలవాడు.

నర్శింహులునాయుడు లేచేడు.

"నదివేపు షికారెల్లొద్దామా?" అడిగేడు జగన్నాథం.

"తలకెక్కింది దిగిపోగల్దు! దిగిపోతే నువ్వు అచ్చురం రాయలేవూ, పదపదా, బండిమీద మీ యింటిల దించేస్తాను. బ్రెదరు-బయలెల్లి పోతండు.." అని నర్శింహులునాయుడ్ని చూపి, జగన్నాథానికి చెప్పేడు విశ్వనాథం.

అందరూ, అతిథి గృహం ఖాళీజేసి, వారి, వారి స్వగృహా(?)లకు, వారి వారి వాహనాల (?)ల్లో బయల్దేరారు. నాగావళినది నిశ్శబ్దంగా, నిండుగా ఆ అతిథి గృహంకి ప్రక్కగా ఆ రాత్రిని మోస్తూ కిందకి ప్రవహిస్తోంది.

కారు డ్రైవింగ్ మీద నుండి నియోజిక వర్గ డ్రైవింగ్ మీదకి దృష్టి మళ్లగా, ఆరులాంతర్ల జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ఢీకొట్టేడు నర్శింలునాయుడు. ఆ అంబేద్కర్ విగ్రహానికేమీ కాలేదు. ఆ కారుకీ యేమీ కాలేదు. గానీ, నర్శింలునాయుడి కుడికాలు ముంగాలి ఎముక చిట్లింది. జంక్షన్‌లోని జనం ఆయనను ఆస్పత్రికి తరలించేరు. మర్నాటికి యీ వార్త నియోజిక వర్గమంతటా రకరకాలుగా ప్రచారమయ్యింది.

* * *

ప్రభుత్వ ఆసుపత్రి రోగిష్టి వాసన వేస్తోంది. స్పెషల్ వార్డులో, సింగిల్ రూమ్‌లో బెడ్‌మీద కాలికి బేండేజీతో పడుకున్న నర్శింలునాయుడికి బేండేజీ బాధగా లేదు. కలిసొచ్చే కాలమేదో కన్పిస్తోంది. అందుకనే సరదాగా -

"జర్నలిస్టు కొడుకుల్ని సంతృప్తిపర్చటం దేవుడితరం గూడా కాదు. హోర్నాయినా! మన మందేతాగి, మన గెస్టుహౌవుసుల్లోనే దొర్లి, మన నోటుబుక్కుల మీద మన పెన్నుల్తోనే మన మీదనే – డౌటింగ్ వార్తల్రాసేస్తారు..." అని, ఫిర్యాదుజేసాడు యెదురుగా కూచున్న శీనుబాబుతోటి.

"జెర్నలిస్టులు సంచిలో కొడవలి లాంటోళ్లు. జాగర్తగ చూసుకోకపోతే, సంచికయినా నష్టం లేదా మనకేనా నష్టం! అందులోకీ జగన్నాథంతోటి మరిన్నూ!" శీనుబాబు, సమయమిదే అనుకొని, వొక పుల్లవేసాడు జర్నలిస్ట్ జగన్నాథానికి వ్యతిరేకంగా.

నర్సింలునాయుడు పుల్లను పట్టించుకోలేదు. అతని ధ్యాస వేరేగా వుంది. గనక, జగన్నాథానికి కితాబులాగే శీనుబాబు మాటల్ని తీసుకొని–

"ఔను మరీ. లెఫిస్టు గదా..." అన్నాడు ప్రేమగా.

"వాడి బుర్ర..! ఆడికో యిజంలేదు. ఆడు ఎడంచేత్తో లెఫ్ట్ పత్రికలకీ, కుడిచేత్తో కమర్షియల్ పత్రికలకీ, టీవిలకీ రాస్తాడు తెల్సా" యింకా శీనుబాబు జగన్నాథం వ్యతిరేక సామానుని పేర్చుతూనే వున్నాడు.

"ఓసారి, మనోడిచేత మనం కరపత్రం రాయించుకోవాల."

"మనకీ రాస్తాడు, అవతలోడికీ రాస్తాడు."

"ఎందుకురా, అలాగ ఆడిమీద సామాను తోసెన్తన్నావు? ఆడివల్ల మనకి పబ్లిసిటీ వొచ్చింది గదా" అని ఆ విషయాన్ని ఆపేసాడు న.నా.

నిజంగా ప్రచారం బాగా జరిగింది. పరామర్శకు గ్రామగ్రామాలూ, పట్నాల్లోని ప్రముఖులూ వొచ్చేరు. ఆసుపత్రి సిబ్బంది గూడా అతి(థి) మర్యాదలుజేసారు.

అపుడు మరోసారి 'డౌటులేదు!'. బ్రెదరు గానీ చనిపోతే, తన గెలుపుకి ఢోకాలేదని నిర్ధారించుకున్నాడు. ప్రేమగా బేండేజీనీ, తృప్తిగా జర్నలిస్టుల్నీ తడుముకొనీ, తల్చుకొనీ మురిసిపోయేడు న.నా. యిక యేదోవొకనాడు అన్నను ఖతం జెయ్యటమే తరువాయి... అన్నలు.

* * *

గానీ, అన్నలు యేమీ చెయ్యలేదు. కూలీరేట్లు పెంచకపోయినా, సంగాల లీడర్లపై కేసుల మీద కేసులు బెట్టినా, ఎర్రజెండా లెగరేసిన జీడితోటల్ని స్వాధీనం చేసుకొని ఎర్రజెండాల్ని పీకించేసినా, పనీ, ఆహారం, రెండూ దొరక్కుండా చేసినా, బియ్యం తినేసినా, బిల్లులమీద బిల్లులు కాంట్రాక్ట్ పన్లు చెయ్యకుండానే మింగేసినా, బిల్డింగ్ల మీద బిల్డింగులు యెక్కడబడితే అక్కడ నిర్మించుకున్నా, వొడ్డీ వ్యాపారంజేసినా, సవాలక్ష వ్యవహారాల్లో తలదూర్చినా యేమన్లేదు...! కనీసం యింటి మీద దాడి గూడా చెయ్యలేదు. పోలీస్ స్టేషన్ మీద దాడిజేసారు. పోలీసుల్నొకరిద్దర్ని చంపేసారు. గాన్నీ తన అన్ననేమీ అనలేదు.

'కొంపదీసి అన్నకీ, అన్నలకూ సీక్రెట్ వొప్పందాలుగానీ...?' ఆలోచించటానికే భయపడి కక్కలేక మింగాలేక మందుగొట్టేవాడు నర్సింలునాయుడు. అయితే, అతనికి మరో విధమైన దోపగూండా కన్పించినట్టన్పించింది.

* * *

అది పాలగదిల రామక్రిష్ణంనాయుడుగారి భవంతి ముందుగది! ఆ గది గోడ మీద కండలు తిరిగిన దేహంతో, బొద్దు మీసాల్తో, గిరజాల జుత్తుతో, కూచున్న కుర్చీకంటే ఘనంగా వొకవ్యక్తి ఫోటో వుంది. ఆ వ్యక్తి పాలగదిల పరిశినాయుడు. అలనాడెపుడో, టూరిస్ట్ బస్సులో తిరుపతియాత్రకి వెళ్ళినపుడు అట్నించటు మద్రాసెల్లి, సిన్మాస్టార్లనీ దర్శించి, ఆ తర్వాత అక్కడే తీయించుకున్న ఫోటో అది!

ఆ ఫోటో పక్కనే మరో ఫోటో వుంది. పెద్ద రోజ్‌వుడ్ కుర్చీ, కుర్చీ చేతులకీ సీటుకీ పులిచర్మం. చేతులు రెండు చివర్లా రెండు పులిబుర్రలు. ఆ కుర్చీ మీద దుస్తులెక్కువా, దుమ్ములు తక్కువా వున్న వ్యక్తి వొకడు, కాలు మీద కాలు వేసుక్కూర్చొని, కొత్తరకం ఫిస్టల్‌నొకదాన్ని పరీక్షిస్తున్నాడు. అతనికి కోర మీసాలున్నాయి. పొడవాటి జుత్తు మీద కిరీటానికి బదులు దొరల టోపీ వుంది. వొంటి మీద దొరల యూనిఫాం వుంది. అతనికి నాణేలు నింపిన చిక్కాల సంచీ అతి వినయంగా అందించుతూ, పాలగదిల పరిశినాయుడు ఎడమవేపు నిల్చున్న ఫోటో అది.

పులి బుర్రలూ, చర్మాల కుర్చీ మీది వ్యక్తి దివాన్ కృపా వల్లభ విశ్వేశ్వర బహద్దూర్. కృపావల్లభుల వారికి - మీదను జమీందార్లూ, తెల్లదొరలూ - కిందను సామంతులూ, రైతులూ వున్నారు.

సామంతూ కాడు, నిండా రైతు గూడా కాడు పాలగదిల పరిశినాయడు.

* * *

బస్సులూ, రైల్లూ, కార్లూ, మోటార్లూ రకరకాల యంత్రాలూ, స్కూల్లూ, మిషనరీలూ, పత్రికలూ, పలురకాల భావజాలాలూ దొరల తర్వాత దిగబడ్డాయి. కత్తులూ, కటార్లూ, ఏనుగులూ, గుర్రాలూ పోయి, జీపులూ, వేనులూ, తుపాకులూ, బాంబులూ, సైనిక దళాలూ నిలిచేయి. పండ్లతోటలూ, పాడీపంటా, తిండి గింజలూ, పంటల మారకపు సంతలూ చెదిరిపోయి మార్కెట్ పంటలూ, మార్కెట్లూ, భూమి కొలతలూ, శిస్తులూ, భూమి యాజమాన్య హక్కులూ వొచ్చిచేరేయి.

'ఈ దేశం మాది', 'ఈ భూమి దున్నేవారిది', 'యీ రాజ్యం ప్రజలది' నినాదాలు, ఉద్యమాలు, పోరాటాలు హింసాహింసల స్వాతంత్ర్య సంగ్రామం...స్వరాజ్య సాధన.

* * *

కృపావల్లభ విశ్వేశ్వర బహదూర్ గారికి దివాణంపోయి నష్టపరిహారమొచ్చింది. అతని కుమారులు పీసపాటి నాగేశ్వరరావు ఎమ్మెల్యే అయి, రాజ్యలక్ష్మి ఆ యింటిగడప దాటనీయకుండా చూసుకున్నారు.

పాలగదిల పరశినాయుడికి దున్నినమేరా భూమి హక్కయ్యింది. అందుకు కొన్ని యిక్కట్లననుభవించేడు; చెరసాల బాధలూ భరించేడు. అందువలన భూమితోపాటు ప్రపంచ విజ్ఞానమూ, లోకజ్ఞానమూ సంపాదించేడు. తన సంతనాన్ని కేవలం భూమి దున్నే రైతులుగా మాత్రమేగాక సర్కారు ఉప్పుదినే నౌకర్లనూ చెయ్యాలనుకున్నాడు. అనుకున్న విధంగానే రైల్వేశాఖలోకి వొక కొడుకునీ, ఉపాధ్యాయశాఖలోకి వొక కొడుకునీ పంపి, గవర్నమెంటు ఉప్పుదిని బతికేట్లు చేసాడు. ఉప్పు సత్యాగ్రహ సమరం అలా అర్థమయ్యిందేమో అతనికి.

పీసపాటి నాగేశ్వరరావు అసెంబ్లీకీ, అక్కడ్నించెక్కడెక్కడకో వెళ్లేవాడు. ఏవేవో చట్టాలనే

వాడు. శాసనాలనేవాడు. అయినా, అటకెక్కిన ధరలు దిగేవిగావు. చీకట్లోని సరుకులు వెలుగులోకొచ్చేవిగావు. అవినీతి అని పిలవక పోయినా 'ఓ'యని పలికేది. పంటచేలికి అతివృష్టో, అనావృష్టో అంటుకొని వుండేది. పంటల ధరలకు నిలకడ వుండేది గాదు. పంపిణీ చెయ్యాల్సిన మిగులు భూములు కాగితాల్లో తప్పా మరెక్కడా కనబడేవిగావు. పేదారోదకు కూలి దొరికేదిగాదు. గోల, గోస...! ఊళ్లూ, బస్తీలూ, పట్నాలూ, నగరాలూ... ఆగ్రహించినాయి. ఆందోళన జేసినాయి. అధికారమార్పుని కోరేయి. నాగేశ్వరరావు గారు అధికారాన్ని తన కొడుకు సర్వేశ్వరరావుకి అప్పగించేరు ప్రజాస్వామ్య బద్ధంగా!

పాలగదిల పరిశినాయుడి రెండో కొడుకు సత్యంనాయుడు మాస్టారుకీ యిద్దరు కొడుకులే. ఆ యిద్దర్నీ పట్నంలో చదువులకి పంపేడు. అయితే, అప్పుడే కొత్తకొత్తగా పట్నాలలోకి, కాలేజీలతో పాటుగానో, ముందుగానో సిన్మాహాల్లూ, లాడ్జింగులూ, హోటల్లూ, క్లబ్బులూ వగయిరాలూ వొచ్చేయి. అవి పల్లె నుండొచ్చిన సత్యంనాయుడి మాస్టారి యిద్దరి కొడుకుల్ని ఆకర్షించినట్టుగా కాలేజి ఆకర్షించలేదు.

సత్యంనాయుడి మేస్టారికి యెలాగైనా కొడుకులిద్దర్నీ వకీల్లు జెయ్యాలనుండేది. భూవివాదాలూ, ఇళ్ల స్థల గొడవలూ, పాత ఆదాయవర్గాల వారికీ కొత్త ఆదాయవర్గాల వారికీ మధ్య ఘర్షణలూ, వకీళ్ల చుట్టూ మాజీ జమీందార్లూ, రైతులూ, వ్యాపార్లూ, పల్లెలూ, పట్నాలూ తిరగటం చూసేరు మేస్టారు. మొత్తానికి వొకటిరెండేళ్లు ఆలస్యమైనా పెద్ద కొడుకు రామక్రిష్ణంనాయుడు వకీలు కాగలిగేడు. వకీలయి వొచ్చేడుగానీ వకాల్తా పుచ్చుకోలేక పోయేడు రామక్రిష్ణంనాయుడు. చెట్టుకింద ప్లీడరుగానే మిగిలేడు. అతడు చెట్టంత ప్లీడరవ్వాలని సత్యం మేస్టారితోపాటు పాలగదిల పరిశినాయుడికీ ఆశ వుండేది.

ఆశించినట్టుగా చెట్టంత మనిషయ్యేడు రామక్రిష్ణంనాయుడు. దివాన్ బహదూర్ సంతానం వరుసగా, ఎన్నికల్లో గెలవటమే గానీ, జనంకి వొరిగిందేమీలేదని, ప్రజాస్వామ్యంలో దివాన్‌గిరీ యేంవిటనీ, జనం మనిషిననీ, కొత్త ఆశలూ, ఆశయాలూ, నినాదాలూ విన్పించేడు రామక్రిష్ణంనాయుడు. పీసపాటి నాగేశ్వర్రావు కుమారుడు సర్వేశ్వరరావుని ఎన్నికల్లో ఓడించి ఎమ్మెల్యే అయినాడు రామక్రిష్ణంనాయుడు. కృపావల్లభుల వారి గృహంనించి ఆ విధంగా రాజ్యలక్ష్మి నడుచుకుంటూ, పాలగదిల వారి గృహానికి వొచ్చింది. ఆ తర్వాత, మరి రెండు ఎన్నికలు జరిగినా, కృపావల్లభుల గృహానికి మరి రాజ్యలక్ష్మి రాలేదు. ఆ గృహంలో పులి బుర్రలూ, చర్మాల కుర్చీ మాత్రమే మిగిలాయి.

"వొకరికి దానం చేసే చేతులేగాని, అర్థించే 'హస్తా'లుకావివి..." జంధ్యంతో గత కీర్తిని గోక్కుంటూ, కృపావల్లభులవారి సంతానం శిథిల భవంతిలో మిగలగా - పాలగదిల వారి వంశం నిత్య సందడితో వెలుగు వెలుగుతోంది. ఆ భవంతి గోడమీది ఫోటోలోని పాలగదిల పరిశినాయుడికెంతో తృప్తీ, ఆనందమున్నూ-

* * *

అదిగో! ఆ గదిలో యేడూళ్ల నాయుడులు కూర్చున్నారు. ఏడూళ్ల నాయుళ్లను చల్లా అసిర్నాయుడు వెంట బెట్టుకొచ్చేడు. చల్లాలి అసిర్నాయుడు నిడువుగా పెరగక, అడ్డంగా పెరిగేడు. ఆరపండిన పసుప్పచ్చని వరికంకిలా నిండుగా వుంటాడు. పొద్దున్న నిద్ర లేచిన దగ్గరనించీ, రాత్రి నిద్దరబోయేదాక పాలేర్ల మీదా, పనిపిల్లల మీదా, పంచాయితీ వార్డు మెంబర్ల మీదా చివరికి పక్కలో నిద్రించే భార్యమీదా కేకలూ, అరుపులూ, ఆజ్ఞలూ,

వార్నింగులే అతని దినచర్య. మాట్లాడితే సర్వావయవాలూ కదుల్తాయి. ఆగ్రహిస్తే చేతికందినవీ, కాలికి అందినవీ యెగుర్తాయి. ఆ తర్వాత అంతే తొందర్లో చల్లబడ్తాడు. 'తాటాకు మంట' అని అంటుంటారు జనం అతన్ని.

"పోన్లే, 'మన మాల్నా కొడుకులే గదా!' అని వల్లకాడులిచ్చేం. 'బతుకుతారు, పోన్లే' అని బాడవా భూంవులిచ్చేం...మాదిగ నాకొడకలకి! కూలిగింజలిచ్చినాం. పాలెరికం జీతాలిచ్చినాం. పెసరా, మినప పంటవేసుకొమ్మని మడిసెక్కలిచ్చినాం.

"అడ్డమయిన పథకాలూ అవతల గవరమెంటూ యిచ్చింది. ఇవ్వలేదేటి? గాంధీయేటి, నెహ్రూయేటి, యిందరమ్మేటి – అందరూ హరిజన గిరిజన భజనే జేసారు! ఏదీ, యెక్కడ దెవలప్పయినారాళు. అసలుకి లక్ష్మీదేవిగాని, సరస్పద్దేవిగాని వొక్కరేత్రి, మాల మాదిగల యిళ్లల్ల వుండగల్దేటి? యాక్..! డోక్కొని పారొస్తాది! ఆఁ!

"దేవతలు! ఆళ్లకి వాంతులొస్తాయిగానీ, మీకు రావేటి? ఇంకా మీరు ఆళ్ల భజనే జేస్తారేటి? సేస్తే సేసుకోండివోయ్! ఓయ్! వొరల్డు బేంకీనప్పుడిగి తాళాలు గొనుక్కొని సేస్కోండివోయ్! మా కబ్జక్కన్లేదు. గాని, మమ్మల్నాపకండి. మీము తేల్చేస్తాం. ఆఁ!

నం...కొడుకులు వొకసెణం కమ్యూనిస్టుల మంతారు. మరొక సెనం కిరస్తానోళ్ల మంతారు. మళ్లా మరొకసెనంకి దళితులుమో అనంతారు.

వల్లకాడులుగాదు. పల్లపుభూములు కావాలంతారు. వాడగాదు, ఊరు గావాలంతారు. కయ్యానికి సమంగా కాలుదువ్వుతారు.

దువ్వండొరే, దువ్వండి! ధూళిల గలిపేస్తాం! ఆఁ! ధూళి, ధూళిల గలిపిగాని, ఆగం! ఆగముగాక ఆగము. వోయ్! మమ్మల్ని ఆపకండివోయ్!" కేకలూ, అరుపులూ, వార్నింగుల్తో చేతిలో కండువాని దులిపేడు. కాలితో నేలని తన్నేడు అసిర్నాయుడు.

రామక్రిష్ణంనాయుడు వొకక్షణం సెల్‌ఫోన్ స్విచ్ ఆన్, ఆఫ్‌లు నొక్కటం, చెవికి ఆన్చటం, తీయటం – మరొకక్షణం కూర్చున్న కుర్చీమీద పరచిన ముఖమల్‌గుడ్డని మెత్తగా కుడి అరచేత్తో నిమరటం చేసాడు.

"నీకు కుర్చీ, సెల్‌ఫోనూ, ఏసీ కారూ యెవ్వారాలన్నీ బాగున్నాయి. బాగా అమిర్నాయి. అనుభగించు. గానీ, అవెల గొచ్చేయో గ్యేపకం జేసుకో. అవి పోకండా చూసుకో..." నర్మగర్భంగా హెచ్చరించి, నాయుళ్లవేపు చూసేడు అసిర్నాయుడు. ఏడూళ్ల నాయుళ్లూ నంది తల ఊపినట్లు ఊపేరు.

రామక్రిష్ణంనాయుడు చెవి వెనక గోక్కున్నాడు. సెల్ స్విచ్‌వేపు బొటనవేలు కదలబోయింది. ఇంతలో సెల్ మోగింది.

"హలో...! రామక్రిష్ణంనాయుడు,ఎమ్మెల్యే స్పీకింగ్. ఆఁ! ఫ్రం...అహమ్మదాబాద్? ఎవరు కావాలి? ఆఁ! నర్సింలునాయుడు చాహతా..." రామక్రిష్ణంనాయుడింకా ప్రశ్నలు వేస్తున్నాడు. నర్సింలునాయుడు గబగబావొచ్చి, అన్నగారి చేతిలోని సెల్‌ఫోన్ లాక్కొని, ఆ గది అవతకి వెళ్లేడు.

రామక్రిష్ణం నాయుడికేమీ బోధపడ్లేదు. గోడమీదకి చూసేడు. పాలగదిల పరిశినాయుడూ, కృపావల్లభుల వారి ఫోటోలు చూసేడు. ఒక నిట్టూర్పు విడిచేడు. ఆ తర్వాత స్పష్టమైన కంఠస్వరంతో –

"కడవడు పాలల్ల చల్లచుక్క పొయ్యికోయ్. చల్లా..." అని చల్లి అసిర్నాయుడికి వార్నింగిచ్చి, చరచరా యింట్లోపలికి వెళిపోయేడు.

వీదిలోంచి వొక్కసారిగా గాలి రివట కొట్టింది. గోడమీది ఫోటోలు కదిలేయి. ఆ శబ్దానికి, ఫోటోలవేపు చూసేడు చల్లా అసిర్నాయుడు.

"గెంతకు, కేకలేయ్యకు, ఆడపిల్ల వొంశపోడివిగదా అని, వల్లకున్నానింతసేపూ! ఒక్క జెల్లగొట్టేనా భూంవి కంటుకుపోతావొరే. ఆఁ! పొలగదిల యింటిల చల్లచుక్క పొయ్యికొరే..." గోడమీది ఫోటోలోని పరిశినాయుడు ఆగ్రహించేడు.

చల్లా అసిర్నాయుడికో క్షణం నోట మాట రాలేదు. తోటి నాయుళ్లవేపు చూసేడు. వాళ్లు చుట్టకొసలు కొరికి అంటించే పనిలో నున్నారు. ఆ దృశ్యాన్ని చూసి "నాయుళ్ల నా కొడుకులం! ఇలగే చుట్టలు కాల్చుకోని వుండిపోనాం! అటు, కర్నపోడూ, బేపనోడూ, అడ్డమైనోడూ, ఊళ్లు గాల్చేసినారు..." అని లోపలే తిట్టుకున్నాడు అసిర్నాయుడు.

సెల్‌ఫోన్ ఆపేసి, అమితానందంగా, అవతలి నుండొచ్చేడు నర్శింలునాయుడు, అన్నగారికి సెల్‌ఫోనుని యిచ్చెయ్యమని మజ్జిపోతినాయుడికిచ్చేడు. వరల్డ్‌బ్యాంక్ వారి ప్లాపీని వంగర ఎమ్మార్వో పట్టుకున్నంత పదిలంగా మజ్జి పోతినాయుడు ఆ సెల్‌ఫోన్‌ని పట్టుకొని రామక్రిష్ణంనాయుడి కోసం యింట్లోకి నడిచేడు.

చల్ల అసిర్నాయుడు అప్పటికి తేరుకొని–

"వోయ్ నర్శింలుబావా! నువ్వు రావాలోయ్ రాజకీయాల్లోకి. ఆఁ! అలగయితేగాని, ఆ నంజికొడుకుల్ని అణగదొక్కలేం...!" నర్శింలునాయుడి భుజాన్ని తడుతూ, ఆహ్వానించేడు.

నంజికొడుకుల్ని అణగదొక్కటానికి రాజకీయాల్లోకి ఆహ్వానించిన అసిర్నాయుడి వేపు ఆప్యాయంగా చూసి,

"త్వరలో హోటల్‌సత్యాలో మీటింగ్ పెట్టబోతున్నాం. అక్కడ మాట్లాడుకుందాంలే" అని బదులిచ్చేడు నర్శింలునాయుడు.

* * *

సెల్‌ఫోన్ తీసుకొచ్చిన మజ్జిపోతినాయుడిని కూచోబెట్టి, ప్రపంచపటం "చూసేవా? మనలాటివీ, మనకంటా చిన్నవీ, పెద్దవీ యెన్ని దేశాలున్నాయో, తెలుసా?" అనడిగేడు రామక్రిష్ణంనాయుడు.

"నూతిలోని కప్పలం. నుయ్యే పెపంచికం మాకు..." కండువా దులిపేడు పోతినాయుడు.

ప్రపంచపటం తీసుకొచ్చి చూపించేడు రామక్రిష్ణంనాయుడు. వేలితో, కొన్ని దేశాల్ని చూపుతూ–

"యిలాటివి కొన్ని దేశాలు చూసాను, ఎమ్మెల్యేల టూర్‌ల. మనకంటా ఆ దేశాలు ఎంత.... ముందుకి పోయేయనుకున్నావ్...?" అనడిగేడు.

"అవతల అసిర్నాయుడాళ్లు నా కోసం సూస్తంద్రు..." అని లేవబోయేడు. పోతినాయుడికి యెరుగని భాగోతం వినబుద్ధి పుట్టలేదుగామోసు.

ఆ తర్వాత రామక్రిష్ణంనాయుడు పోతినాయుడి గ్రామం పరిస్థితినీ, పంటల్నీ, పండ్ల తోటల్నీ, ధాన్యపు కుప్పల్నీ వగైరాల్ని గురించీ వాకబుజేసాడు.

"అదేదో కతలోన శాపఫలంలాగ వృక్షం మీది ఫలాల్ని తెంపి వొడిలో వేసుకొని, యింటికొచ్చి చూత్తే వొకిటే మిగిలీదట వొక మహాసాధ్వికి. అలాగ, పండితేటి, పండప్పోతేటి రైతోడికి శాపవిముక్తి గాలేదు గదా..." అని లేచేడు పోతినాయుడు.

* * *

హరిజనవాడకీ, ఊరికీ మధ్య దోవలో మామడితోటలు! తోటల మధ్యలో పేద్ద పెద్ద ధాన్యపు కుప్పలూ, గడ్డి కుప్పలూ! ఆ తోటలనూ, ఆ కుప్పలనూ మాల, మాదిగలు కాపు గాస్తారు. మామిడికాయలు కొన్నిపోయేయనో, ధాన్యం తరుగులున్నాయనో చిన్నాచితకా అనుమానపు తగువులే తప్పా కాపలాదార్లకూ, యజమాన్లకూ మధ్య పెద్ద గొడవలేమీ లేవు గతంలో. తోటలుగానీ, కుప్పలుగానీ యిప్పటిదాకా దగ్ధంగాలేదు.

రామక్రిష్ణంనాయుడి నిండొచ్చిన మర్నాటి రాత్రి మజ్జి పోతినాయుడి మామిడితోట అంటుకుంది. ధాన్యపు రాశులూ, గడ్డి కుప్పలూ కాలిబూడిదయ్యేయి. మంటలు వువ్వెత్తున ఎగిసేయి. అవి, ఆ తోటకానించిన చల్లా అసిర్నాయుడి కుప్పల మీదకూ పాకేయి.

* * *

గంధవరపు శీనుబాబు – సాసుబిల్లి విశ్వనాథాన్ని వెంటేసుకొని ఆదరాబాదరాగా వొచ్చేడు. రామక్రిష్ణంనాయుడు లేడు. నర్సింలనాయుడే వున్నాడు.

"రైలు బోగీకి నిప్పెట్టీసి, అరవయిమంది హిందువుల్ని చంపీసేరట. గోరం. దానికి నిరసనబందు జరపాలట..యేటంతావ్." అడిగేడు శీనుబాబు. ఇప్పుడూ తెల్లదుస్తుల్లోనే వున్నాడు. సాసుబిల్లి విశ్వనాథం మాత్రం కాషాయదుస్తులూ, సింధూరపు బొట్టూ...! చేతిలో త్రిశూలమే కొరత!

నర్సింలునాయుడు వారితో కొంతసేపు అహమ్మదాబాద్ ఫోనూ, ఆరెస్సెస్ లోకల్ భోగట్టా, దాని ఫ్యూచర్ గురించీ మాట్లాడి, వొక దీర్ఘ నిశ్వాసాన్ని వొదిలి, భుజాలెగరేసి–

"బంద్ జరపడంకీ అన్న వుండాలేటి?" అనడిగేడు.

"అలగని కాదు, యెవుడేనా వ్యతిరేకిస్తే; వొక పిసరు కత్తీ, కఱ్ఱా వాడాలగదా...?" గొణిగేడు విశ్వనాథం.

అన్న స్థానంలో తనను చూసుకోమని భరోసా యిచ్చేడు నర్సింలునాయుడు.

క దీర్ఘ నిశ్వాసాన్ని వొదిలి, భుజాలెగరేసి–

"బంద్ జరపడంకీ అన్న వుండాలేటి?" అనడిగేడు.

"అలగని కాదు, యెవుడేనా వ్యతిరేకిస్తే; వొక పిసరు కత్తీ, కఱ్ఱా వాడాలగదా...?" గొణిగేడు విశ్వనాథం.

అన్న స్థానంలో తనను చూసుకోమని భరోసా యిచ్చేడు నర్సింలునాయుడు.

* * *

మబ్బులు గమ్మిన ఆకాశం. ఏ దయ్యపు హస్తానికో జడిసి తలుపు సందు దాక్కొన్న బాలుడిలా మబ్బు మాటున సూర్యుడు! పొద్దుటి సల్లందుల వేళ! ఉక్కబోత. చెట్టూ, చేమా చలన రహితం. హరిజనవాడ బిక్కజచ్చినిల్చిన గుడారంలా వుంది. పురిపాకల్లో ఉట్టెలకు సల్లంది కుండలు నిర్జీవంగా వేలాడుతున్నట్టున్నాయి. పొయ్యిలలో బూడిదను– దేవుని ప్రసాదంలా కుప్పలుబోసి ఆడుకునే పిల్లల్లా దువ్విబోసి, ఆడుకున్నాయి పిల్లులు! పురిపాకల తలుపు మూలసందుల్లో కుమ్మరి గూన చోడిగింజల్లో, వాటి మీద వొక వెడల్పాటి దాకలో ఎండుచేపలూ, వాటి మీద మూకుడుతో మూతి ముడుచుక్కూచున్న ముసలమ్మలా వుంది. హరిజనవాడకి కూతవేటు దూరంలో నాగావళి నది, మీదను యెక్కడో పడిన వర్షంతో బురదను మోసుకొస్తోంది. ఇండుపుకాయలను నీళ్ల కడవల్లో వేసుకు అరగదీసి, నీటిని ఫిల్టర్ చేసుకుంటున్న మహిళలు.

కలకలకలా, గలగలా, జరజరజరా... నదిలో కలక, కాదు జనంలో కలవరం...! హరిజనవాడలో కలవరం...!

ఎటుజూసినా కాల్తోన్న పురిపాకలు, ఆర్తుల కేకలు. తెగిపడ్తోన్న, మానవ అవయవాలు. పరుగో పరుగు... ప్రాణాలరచేతుల్లో... పరుగు!

ఉట్టెలు తెగిరాలిపడినయి. పొయ్యిలు కూలినవి. గూనలు పగిలినవి. కాలిన కమురు వాసన! గజగజా వజవజా – వెన్నుపూసల వొణుకు!

* * *

సాసుబిల్లి విశ్వనాథం, గంధవరపు శీనుబాబూ పట్నంలో బంద్‌ని విజయవంతం జేసారు. త్రిశూలాలు గుండెలకు గురిజూపి, షాపుల షట్టరు మూయించేరు. అక్కడక్కడా అవసరమయిన కత్తీ, కఱ్ఱా, త్రిశూలాలూ వాడేరు. ఎలాగూ నర్శింలు నాయుడి భరోసా వుంది గదా. విజయోత్సాహంతో నర్శింలు నాయుడి దగ్గరకు వెళ్లేరు. న.నా యింట్లో లేడు. ప్రభుత్వ అతిథిగృహంలో వున్నాడు. 'అక్కడే సెలెబ్రేట్ చేసుకుందాం' అంటూ అటే తిప్పేరు వాహనాల్ని. మళ్లీ అతిథి గృహంలో మూడు రౌండ్లూ, 'బ్రెదర్‌కి బదులు నర్శింలునాయుడు నిల్చి గెలవటం, డౌటులే'దని మూడుసార్లు వక్కాణించుకోవడం జరిగింది. అయితే, అప్పటిలా నర్శింలు నాయుడికి ఏక్సిడెంట్ జరగలేదు. ఎడమకన్ను పదే పదే అదిరేది.

"మగోడికి ఎడమకన్నూ, ఆడదానికి కుడికన్నూ అదరగూడదట..." శ్రీనుబాబు, తెల్లచొక్కా మొహంతో పలికేడు.

"అదరా! ఆ అపశకునపు కవుర్లే వొద్దంతాను. మందుగొట్టినా నీ నోటంట మంచి కవుర్రాదు. కన్ను అన్నాక అదరదా, నోరు అన్నాక వాగదా? అదీ తప్పేనా? లెగంఢ్రా, సాల్చు..." అని, చొక్కా దులిపేస్తూ, శీను బాబుని దులిపేస్తూ, మిత్రబృందాన్ని లేపేడు విశ్వనాథం.

* * *

ఊరికీ, దళితవాడకీ దగ్గర్లోగల జాతీయ రహదారి ప్రక్కగా శరణార్థ శిబిరం వేసారు. దళిత సంగాల వారు సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మరో ప్రక్క, క్షతగాత్రుల్ని వెంటబెట్టుకొని మండల ఎమ్మార్వో దగ్గరకీ, జిల్లా కలెక్టర్ దగ్గరకీ ఊరేగింపుగా వెళ్లి, మెమోరాండమిచ్చేరు. ఇల్లూ, పొల్లూ, ఆస్తులూ, మానప్రాణాలూ హరించారనీ; దోషుల్ని శిక్షించాలనీ; బాధితులకు పరిహారమందించాలనీ విన్నవించుకున్నారు.

క్షతగాత్రుల్తో, అనాథల్తో, అన్నార్తుల్తో ఆ శిబిరం దుఃఖపు గుడారంలా వుంది.

* * *

తాటాకుల మంట చప్పున చల్లారి పోయింది. రామక్రిష్ణంనాయుడు కోసం పరుగెత్తేడు చల్లా అసిర్నాయుడు. వెంట ఏధుళ్ల నాయుడులూ వున్నారు. రామక్రిష్ణంనాయుడు లేడు, హైదరాబాద్‌లో వున్నాడట! నర్శింలునాయుడే యింట్లో వున్నాడు. మళ్లీ అసిర్నాయుడు–

"వోయ్, నారిబావా! నువ్వు రావాలోయ్ రాజకీయాల్లోకి... అలగైతేగాని ఆ నంఁ... కొడుకుల్ని, అణసలేం..." అని ఆహ్వానించేడు.

ఒక తృప్తిపూర్వక చిద్విలాసం విసిరేడు నర్శింలునాయుడు. అప్పుడే పత్రికలవారూ వొచ్చేరు. చల్లా అసిర్నాయుడ్నిచూసి, గ్రామంలో దళితవాడపై దాడి గురించి ప్రశ్నించేరు. తాటాకు మంట మళ్లీ అంటుకుంది. ఎర్రబడ్డ మొహంతో –

"తోటలు కాలిపోనాయి. ధాన్నెం కుప్పలు కాలిపోనాయి. సంపద, సంపద కాలి పోయింది. కనబళ్లేదు మీకు? అవెందుక్కాలినాయి? ఎపుడు కాల్సినాడు? రాయరా? మీ కలాలకి వొక కన్నే వుంతాదన్నమాట? వోసోసె, వొల్లకోర్రా!...మీకెవుడేనా జెల్లగొడితే వొల్లకుంతారా? వోర్నాయినా...వూరూవాడా గోలజేసిరా? సేతిల కలాలున్నోళు మీరే, ఆగ్రయించి – అడ్డదిడ్డమైన రాతలకీ దిగి పోతారే; మరి సేతిల కత్తులూ, కటార్లున్నోళు దిగరా? వోసెల్లర్రా.." చీదరించుకొని, కండువా దులిపేడు చల్లా అసిర్నాయుడు.

జర్నలిస్టులు నర్శింలు నాయుడివేపు చూసేరు. నర్శింలునాయుడు, వారివేపు గూడా వొక చిద్విలాసం విసిరి –

"అందరూ గాంధీ మహాత్ములు కారుగదా! ఆగ్రహావేశాలూ, ప్రతీకారాలూ మానవ సహజం..." అని, శాంతస్వరంతో చెప్తోంటే –

"వోయ్! గాంధీమాత్ముడికే దిక్కులేక పోయింది. యేటయ్యేడు? అంతేనివోయ్‌బాబూ...! సెంపమీద కొట్టీదాక గాదు, సెయ్యెత్తితే కొంపలబెట్టి తగలెట్టీయాలవోయ్ బాబో...లేపోతే గాంధీగోర్లాగయిపోతాం! యేటయ్యేడు గాంధీగోరు? అతగానికే దిక్కు లేకపోయింది!

వోయ్! సేతులు కాలిని తరాత ఆకులు పట్టుకుంతే లాభమేటి? ఉప్పుడూ, సపోజు యీ యిలేకర్లే వున్నారు. ఆళు అడ్డంవయిన రాతలు రాసీకండా ముందే ఆపీయాల! అంతేగాని, ఆళు రాసీసింతరాత ఖండనిస్తావ్ యేట్లాబం? రెండూ గురుతుండిపోతాయి సదివినోడికి! అందికని, ముందే దెబ్బదీసీయాల మనం! అవతలోడికి అవుకాశిం యివ్వగూడదు. దెబ్బకి అవతలోడు అబ్బని తల్సుకోవాల! అంతేనివోయి! ఏటంతా రువయ్యా – విలేకర్లూ?" అని గూడా ప్రశ్నించేడు చల్లా అసిర్నాయుడు.

విలేకర్లు అప్పటికే కలాలు మూస్సేరు. నోట్‌బుక్కులు ముడిచేసారు. మూతులు ముడుచుకు కూర్చున్నారు.

నర్శింలు నాయుడే కల్పించుకొని–

"అన్న రేపొద్దుటే ఫలక్‌నామాకి దిగుతండు..." అని చెప్పేడు.

విలేకర్లు లేచి–

"అయితే రేపొస్తాం..." అని వీడ్కోలు తీసుకుంటుండగా–

"రాత్రికి గెస్టహవుస్‌కి రండి..." అని ఆహ్వానించేడు న.నా., వారిని.

* * *

ఫలక్‌నామా రైలు దిగేడు రామక్రిష్ణంనాయుడు. మజ్జి పోతినాయుడూ, రాద సీతన్నాయుడూ, మరో యిద్దరు నాయుళ్ళూ, రెవిన్యూ అధికార్లో యిద్దరూ, పోలీస్ అధికార్ల ముగ్గురూ వెంట రాగా – గ్రామంలోని దళిత శిబిరం దగ్గరకు వెళ్లేడు. బాధితులను పరామర్శించేడు. రేషన్‌లూ, కాలనీలూ, గుడ్డలూ శాంక్షన్ చెయ్యమని అధికార్ల నాదేశించేడు. 'ప్చ్చొచ్చోలు', 'ప్చలు' కళ్లనీళ్లూ, కర్చీప్‌లో చీదటాలూ...చేసాడు. అతనికంతా అయోమయంగా వుంది. దారుణమారణకాండ సాగుతోన్న గుజరాత్ గుర్తొస్తోంది. పత్రికా విలేకర్లు ముట్టడించేరు. ప్రశ్నలు సంధించేరు. "నాకెంతో భాదగా

వుంది. మనిషికి వొక్కడికే ఖన్నీటి భాద తెలుసనుకున్నాను. లేదు. తెల్దు! మనిషి - మృగాన్ని దాటి ముందుకి పోలేదు. మతంగా వొచ్చు. కులంగావొచ్చు - మృగాల్ని పెంచగూడదు..తప్పు!" అని నొచ్చు కున్నాడు. పెట్టగూడని చోట వొత్తులుబెట్టి పలికేడు.

"అయితే దోషుల్ని శిక్షిస్తారా?" అనడిగేరు విలేకర్లు.

"ఇలాంటి గొడవల్ని అరికట్టాల ప్రభుత్వం. రోజుల తరబడి విధ్వంసం జరుగుతుంటే అరికట్టలేని ప్రభుత్వమెందుకు?"

"అంటే ప్రభుత్వాన్ని దిగిపోమంటున్నారా?"

"ముఖ్యమంత్రిని మార్చినా, పరిస్థితి అదుపులో కొచ్చునేమో అని మా పార్టీ భావం..!" జవాబిచ్చేడు రామక్రిష్ణంనాయుడు.

అప్పటికి విలేకర్లకి అర్థమయ్యింది. ఆయన యిక్కడి గ్రామంలోని దళితులపై దాడి గురించి మాట్లాడలేదని! అప్పుడు వో విలేకరి-

"యీ హరిజనవాడపై దాడికి సంబంధించి మీరేమి చెప్ప..." అని ప్రశ్నించబోయేడు. గానీ, అప్పటికే తాబేలు, దేహాన్ని చిప్పలోకి ముడుచుకున్నట్టు, ఏసీ కారులోకి దేహాన్ని దూర్చేసాడు రామక్రిష్ణంనాయుడు. గన్‌మేన్‌లు, ప్రశ్నల్ని దూరంగా నెట్టేసారు.

* * *

రామక్రిష్ణంనాయుడు - గదిగోడ మీది పాలగదిల పరిశినాయుడు ఫోటోనీ, కృపావల్లభుల దివాన్‌వారి ఫోటోనీ చూస్తూ గదిలో పచార్లు చేస్తున్నాడు. గదిలోని ట్యూబులైట్ వెలుగంతట్నీ కక్కుతోంది. ఫంకా విలవిలలాడ్తోంది. గదిలోని కుర్చీలు, సోఫాలూ చతికిలబడ్డ జీవాల్లా వున్నాయి. ఉండి, ఉండీ బయటినించి, గాలి, గదిగోడల్ని కొట్టుకొని వెనక్కి వెళిపోతోంది. రామక్రిష్ణంనాయుడు దీర్ఘనిశ్వాసం వొదిలేడు.

మజ్జిపోతి నాయుడొచ్చేడు. రామక్రిష్ణంనాయుడు పచార్లు ఆపి, ప్రపంచపటం తీసేడు. మజ్జి పోతినాయుడు చేదు తాగబోయేలా మొహం బెట్టేడు. రామక్రిష్ణంనాయుడు ప్రపంచ పటంలో వొకచోట వేలిపెట్టి చూపుతూ-

"యిది యే దేశమో తెల్సా? ఎంత ముందుకు పోయిందో తెల్సా? ప్రెపంచంల యిదంటే ఎంత మోజో అందరికీ, తెల్సా?" వగైరా ప్రశ్నలు వేయగా మజ్జిపోతినాయుడు-

"యేటో, యెరగని బాగోతం..." అన్నాడు.

"యీ దేశపు అధ్యక్షుడు యించుమించుగా ప్రెపంచానికి అధ్యక్షుడు, ప్రపంచ బ్యాంక్ యితగాను సెప్పినట్టయింతాది..." ఉత్సాహంగా చెప్తోంటే-

"యెదురులేని మొనగాడన్నమాట...!" నిర్ధారించేడు మజ్జి పోతినాయుడు.

"యీ మధ్య యితగాని దేశంలోని ఆయుధగారమ్మీదా, బిజినెస్సెంటర్ మీదా దాడులు జేసారు..."

"ఎవుళంత ఘనాపాటీలు?" ఆశ్చర్యబోయేడు పోతినాయుడు.

"టెర్రరిస్టులు...!" చెప్పాడు రామకృష్ణంనాయుడు.

"అంతే? పేదరాశి పెద్దమ్మ కొడుకులా...?"అడిగేడు పోతినాయుడు.

రామక్రిష్ణంనాయుడికి అనుమానమొచ్చింది. పరిశీలనగా చూసేడు పోతినాయుడ్ని. ఆ చూపుని శంకించిన పోతినాయుడు,పెడతల గోక్కుంటూ-

"యెరగని బాగోతం...!" అని సంజాయిషీ చెప్పుకున్నాడు.

ఇక మరి ప్రపంచపటం చూపటం నిష్ప్రయోజనమని యెంచి, లోకల్ విషయాల్లోకి, గ్రామాల్లోని విషయాలకి, దళితుల, నాయుళ్ల ఘర్షణల దగ్గరికి వొచ్చేసాడు రామక్రిష్ణంనాయుడు.

"యేమాత్రం యెనకడుగెయ్యిడట! కాగితమ్మీద అరెస్టుకయినా సరే, వొప్పడట. ప్రతిష్టకొశ్చినట. మేనేజిచెయ్యిడిం సేతగాకపోతే తప్పుకోమను. తమ్ముడి కిచ్చీమనుకుర్చీని, అతగాను సూసుకుంతాడు. పంచాయితీనించి పార్లమెంటుదాకా తొడగొట్టి నిలబడతాం అన్సెప్పన్నాడు చల్లా అసిర్నాయుడు. వారం రోజుల్ల తేలప్పోతే, వారం తరాత లాడ్జి సత్యాల నర్సింలునాయుడి గ్రూపు మీటింగుల మీమే తేల్సుతాం అనీ అన్నాడు అసిర్నాయుడు..." హావ, భావ ప్రదర్శనల్తో, విషయం చెప్పి, లేచేడు పోతినాయుడు.

రామక్రిష్ణంనాయుడా భోగట్టా విన్నాడు. గోడమీది ఫోటోలను మరోసారి చూసి, క్షణ కాలం కళ్లు మూసుకున్నాడు. యిదే అదను, కళ్లుదెరిచి మళ్లీ ప్రపంచపటం తీస్తాడేమోనని చల్లగా జారుకున్నాడు మజ్జి పోతినాయుడు!

* * *

వారంరోజుల లోపుగానే వ్యవహారాల్ని చక్కదిద్దేయగలిగేడు రామక్రిష్ణంనాయుడు. మూడు రోజులు హైదరాబాద్‌కీ, ఢిల్లీకీ విమానాల మీదనే తిరిగి, పట్టుకోవాల్సిన వార్ని పట్టుకొని ఖాళీగా వున్న, ఆ యేరియా ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌కి బోర్డు డైరెక్టర్‌గా చల్లా అసిర్నాయుడి నియామక ఉత్తర్వులు. పట్టుకొచ్చి; అసిర్నాయుడి చేతిలో పెట్టేడు. అసిర్నాయుడు పాదాభివందనం జేస్సాడు రామక్రిష్ణంనాయుడికి! అప్పుడు 'దళితులపై దాడీ, కేస్సూ, అరెసూ...!' అన్నాడు రామక్రిష్ణంనాయుడు! 'కాగితమ్మీద అరెస్టుకాదు, కటకటాలకే నువ్వెళ్లమంటే యెళ్లనేటి...?' అని, అంగీకరించేడు అసిర్నాయుడు!

అటు అసిర్నాయుడి అరెస్టు తర్వాత దళిత నాయకుడు కక్కల సాంబయ్య యింటకెళ్లేడు రామక్రిష్ణంనాయుడు! జరగబోయే పంచాయత్ ఎన్నికల్లో సర్పంచ్ పదివి రిజర్వ్ కేటగిరిదనీ, అదినీదేనని సాంబయ్యకి బొట్టు పెట్టేడు. మజ్జి పోతినాయుడితోట, అసిర్నాయుడితోటల దగ్ధం కేసులెత్తివేయిస్తునానన్నాడు. వెంటనున్న మజ్జి పోతినాయుడిచేత గూడా 'ఔన'నిపించేడు. ఆ తర్వాత, సాంబయ్య బాధితుల శిబిరాన్ని యెత్తి వేయించేడు!

ఎక్కడి మంటలక్కడ ఆరిపోయేయి. గ్రామాలన్నీ తిరిగేసి, పట్నం చేరుకున్నాడు. రామక్రిష్ణంనాయుడు. వారం గడువుకింకా వొకరోజు మిగిలివుంది!

చల్ల అసిర్నాయుడు 'నారిబావా నువ్వు రావాలోయ్ రాజకీయాల్లోకి' అని అనటం లేదు, సరిగదా కలవటం లేదు. సాసుబిల్లి విశ్వనాథ్‌మేమో, మద్రాస్ కల్చరల్ అసోసియేషన్ వారికి అతిథిగా వెళిపోయేడు. గంధవరపు శీనుబాబు తెల్లదుస్తులు మార్చేసి, నల్ల దుస్తులూ, అయ్యప్పమాలా ధరించి పోన్‌జేస్తే "స్వామి శరణం, పూజలోనున్నాను..." అని తప్పించు కున్నాడు. చిన్నాచితకా కాంట్రాక్టర్లూ, జర్నలిస్టు జగన్నాథం మాత్రమే వెంట మిగిలేరు! ఏమీ పాలుబోలేదు. 'సత్యాలాడ్జి సమావేశం యెలా జరపాలి?' సమర్థులూ, సహచర మిత్రులూ లేక నడుము విరిగిన పాము అయ్యేడు నర్సింలునాయుడు!

అప్పుడు, నడుము విరిగిన సర్పాన్ని పిల్చి, వొకరాత్రి సోఫాలో కూచోబెట్టి, క్షణకాలం మౌనం తర్వాత, రామక్రిష్ణంనాయుడు స్పష్టమైన గొంతుతో–

"వొరే తమ్ముడూ, నారిబాబూ! జేగర్తగాయిను. ఈరోజు నేను చెప్పే విషయాలు మళ్లా, మళ్లా నీకు చెప్పను. జేగర్తగిను.

పదవులందరికీ కావాలని వుంతాది. ఆ గోడమీది ఫోటో సూడు. (న.నా. గోడ మీది ఫోటోవేపు చూసేడు) ఆ ఫోటోల అంత వినయంగా అవుపిస్తన్న పాలగదిల పరిశినాయుడికీ ఆశవుండే వుంతాది. అయితే, అతగాడికి అవుకాశం రాలేదు, మనకొచ్చింది! అంతే, అతనికంట ఘనులం కాము, గుర్తుట్టుకో! నీకూ అవుకాశం వొస్తాది. రాకపోతే తెచ్చుకుంతావు. తమ్ముడొరే! జేగర్తగిను...! పదవిచుట్టూ పాపపాలోచనలూ, పాపపు కార్యక్రమాలూ వుంతాయి. రాచరికం నించి, యిప్పుడి డెమాక్రసీదాకా – అదే యిస్టరీ! అయితొకటీ, రాచరికంల–కోటలూ, బలగాలూ, ధనమూ, దస్కమూ, వీరత్వమూ వుండేవి. ఇప్పుడీ డెమక్రసీల, ఆటితోటి పాటు– చతురతా, యెత్తుకు పై యెత్తూ, లౌక్యమూ, మెజారిటీ జనం ఆమోదమూ వుండాల!

మేకలూ, కోళ్లూ, చిలకలూ, గోరింకలూ, గోమాలక్ష్మిలూ వగయిరా సాధుజెంతువులూ; పుల్లూ, సింహాలూ, గెద్దలూ, రాబందులూ, నక్కలూ, నాగుబాములూ నానా రకాల క్రూర జెంతువులూ కలిసి బతికే ప్రెపంచకం యిది.

దేవుడు – యీ ప్రపంచాన్ని దేనిబతుకు దానిదన్నట్టు యెలాగజూసుకుంతాడో, అలాగ యీ డెమక్రసీల లీడరు చూసుకోవాల. పదవిని పదిలంగా చూసుకొని, మిగిలిన ప్రపంచికాన్ని దేవుడి పోలసీకొదిలియ్యాల!

"కప్పని మింగిందని పాంవునీ, గోవుని సంపిందని పులినీ శిక్షించీడు గదా దేవుడు? అదన్నమాట! అది గాక, యేడ్పుగొట్టు మొహాలకి యెలాంటి జెవాబిచ్చేడు...? సృష్టేటి, లయమేటి? సర్వం నేనే...! అనన్నాడు! అదన్నమాట! గురుతెట్టుకో!

దివాన్ కృపావల్లభుల యింటి నుంచొచ్చిన రాజ్యలక్ష్మి–మన యిల్లు దాటి వెళిపోకుండా, చూసుకోవాలి! అది ముఖ్యం! అంతేగాని, చల్లా అసిర్నాయుడెగిర్తే మన మెగరటం, కక్కల సొంగబయ్య యేడిస్తే మనం యేడటం–యెవుడో రౌడీసుపనులు జేస్తే; అడ్డీదానికి మనం యెళిపోడం–దేవుడి పోలసీకి వ్యతిరేకం! పెంటమీదవి–యింటి మీదకి తెచ్చుకోవటం లాగుంటది. గురుతెట్టుకో!

మనది పాలగదిల పరశినాయుడి వంశం.పాలిత వంశం వొకనాడు. గానీ నేడో? పాలకవంశం? పాలితులకీ, పాలకులకీ, వొకే విధమయిన సమస్యలు వుండవురా తమ్ముడా? వొకే విధమయిన పరిష్కారాలూ వుండవురయ్యా! జేగర్తగిను. అదన్నమాట! అది గుర్తెరిగి మసులుకో! మళ్లా, మళ్లా యీ భోగట్టాలు సెప్పను. నువ్వికిప్పుడాలోసించి–యే మీటింగెడతావో, యే పార్టీల చేరతావో నిర్ణయంచుకో! యేటి?.." అని భుజం చరచి, లేచాడు రా.క్రి. నాయుడు.

న.నా మెదడు నిండా యెన్నెన్నో ప్రకంపనలు. సూర్యకిరణాలు సోకి వికసించిన 'కమలం'లా – న.నా మొహం వికసించింది.

రా.క్రి. నాయుడు, తమ్ముడ్ని వొదిలేసి బయటికి వెళ్లబోతూ వెనక్కి తిరిగి, తమ్ముడి వేపోసారి చూసేడు. తమ్ముడు నర్సింలు నాయుడు కమలంలా వికసించి, వెలుగు నిండిన మొహంతో, గది ఈశాన్యమూలనున్న శ్రీరామపాదుకా పట్టాభిషేకం ఫోటో ముందు అగరత్తి వెలిగించి దండం బెడ్తున్నాడు. రామక్రిష్ణంనాయుడికి ఎడమ కన్ను అదిరింది. అప్పుడే సెల్‌ఫోనూ మోగింది. అహమ్మదాబాద్ నుంచేమోనని–నర్సింలునాయుడు, దేవుడి

ఫోటో నుండి అన్నవేపు అడుగువేసాడు. రామక్రిష్ణం నాయుడు, సెల్‌వేపు చూడకుండానే ఆఫ్ చేస్సి; తమ్ముడివేపు దీర్ఘంగా చూసేడు. ఆ చూపు అర్థం బోధపడిన నర్సింలునాయుడు మజ్జి పోతినాయుడిలా 'యెరగనిబాగోతం' అనన్లేదు. తనూ, అన్నవేపు చూస్తూ-

"బేలటూ, బులెటూ రొండూ కరక్టుగా వోడుకున్నోడే-యిప్పుడీ డెమోక్రసీల నెగ్గుకొస్తాడన్నమాట...?!" అనన్నాడు; అన్న ఉపన్యాస సారాంశమిదేగదా అన్నట్టు...!

రామక్రిష్ణం నాయుడు విని, మౌనంగా, అన్యమనస్కంగా అక్కడ్నించి నిష్క్రమించేడు. ఆ రాత్రి మౌనంగా చీకటిగా, అడవిలో వేటగాని 'మాటు'లా గడిచింది!

* * *

రామక్రిష్ణంనాయుడు అసెంబ్లీ సమావేశాలకై హైదరాబాద్ ప్రయాణ యేర్పాట్లలో వున్నాడు. మజ్జి పోతినాయుడొచ్చేడు. రా.క్రి.నాయుడు ప్రపంచపటం తీయక ముందే-మజ్జి పోతినాయుడు పాతపట్నం అమ్మవారి సింధూరం యిచ్చేడు. రా.క్రి.నాయుడు నుదుటిన బొట్టు దిద్దుకొని, పోతినాయుడ్ని కూచోబెట్టి, ప్రపంచపటం తీసేడు. 'అమ్మవారూ-ఆపలేకపోయిందిరా' తండ్రి!, అని దిగులుబడుతూ-'కానీయ్, సిద్ధమైపోనాను-యేం బాగోతం ఆడేస్తావో, ఆడెయ్' అన్నట్టుగా కూచున్నాడు పోతినాయుడు.

"యిదిగిదిగీ దేశం చూడు. ఇక్కడ ఉగ్రవాదులున్నారు. వరల్డంతా యీళ్లకి బ్రాంచీలున్నాయి.." అని, యింకా చెప్పబోతున్నాడు రా.క్రి.నాయుడు.

"వొరల్డు బేంకీ కున్నట్టిగా..." ఊఁ కొడుతూ, పలికేడు పోతినాయుడు.

"యీళు యెక్కడుంటే అక్కడ అభివృద్ధి వుండదు. శాంతి భద్రతలుండవు. ఆ దేశిం ముందుకి పోదు..." చెప్తున్నాడు రా.క్రి. నాయుడు.

"మన దేశంలా..వున్నారేటి ఆళు..?" రెప్పలు టపటపలాడిస్తూ ప్రశ్నించేడు, పోతినాయుడు. రా.క్రి.నాయుడు సూటిగా చేసేడు, ఆ చూపుని గ్రహించిన పోతినాయుడు, పెడత గోక్కుంటూ-

"యెరగని బాగోతం! మన దేశం ముందుకి పోలేదని అంటంటావు గదా..." అని సంజాయిషీ యిచ్చుకున్నాడు.

"యింతకీ యెవుళనుకుంటున్నావాళ్లని...?" అనుమానంగా అడిగేడు రా.క్రి.నాయుడు.

"ఎవుళ్ని?"

"అదేనోయ్, వొరల్డంతా బ్రాంచీలున్నాయోయ్ ఆళ్లకన్నానే, ఆళ్లెవురనుకున్నావ్?! ఆళ్లెవెరువోయ్?"

"పేదరాశి పెద్దమ్మ కొడుకులు..." పెడత గోక్కోకుండానే బదులిచ్చేడు పోతినాయుడు. ఓ క్షణం అనుమానపు చూపు విసిరి, మళ్ళీ చూపు మార్చి, యికమరి అసలు విషయాల కొచ్చేయాలని, ప్రపంచపటం మూస్సేడు రా.క్రి.నాయుడు. లోకల్ విషయాల కొచ్చేసాడు. చల్లా అసిర్నాయుడు సుబ్బరంగా గ్రేమీణ బేంక్‌ని యేల్తున్నాడనీ, సాసుబిల్లి ఇశ్వనాథం-మద్రాస్‌కీ మనూరికీ మధ్యన తిరుగుతన్నాడనీ, గంధవరపు శీనుబాబు 'జ్యోతి' దర్శనం దాకా 'మాల' తియ్యడనీ, కక్కల సాంబడు 'పంచాయితీ చెక్కు పవరు సర్పంచుల కొస్తాదా?' అని ఆరాలు తీస్తున్నాడనీ...నర్సింలునాయుడు దేవుడి గుళ్లు 'యాత్ర'లో నున్నాడనీ-అన్నీ సజావుగా వున్నాయని మజ్జి పోతినాయుడు చెప్పేడు. చెప్పి కాసేపాగి, "గానీ..." అని మళ్లీ ఆగేడు.

రా.క్రి.నాయుడు,పెట్టె సర్దుకొని, లాల్చీ సర్దుకొని, తలదువ్వుకొని అద్దంలో ఓసారి చూసుకొని, బయల్దేరగా–పెడతగోక్కోని–

"దేవుని మాన్యెం భూమి పేదారోదకే సెందాల. అమ్ముతారేటి? మీ మొప్పం అని ఒక గ్రూపు భూములాక్రమించగా కరువు దాడులట మరొక విప్లవ గ్రూపు జేసాయి! మా పూరిల కొన్నిళ్లల దాడిజేసినారు. దాన్నేం గిన్నేం నగలూనట్రా, డబ్బు, దస్కం...లాక్కున్ను..." అని చెప్పేడు పోతినాయుడు.

"అందికే మనదేశం ముందుకి పోదు..." అని విసుక్కొని, ముందుకి నడిచేడు రా.క్రి.నాయుడు.

"యేటో...? యెరగని భాగోతం..." గొణుక్కుంటూ, వెనకనడిచేడు మజ్జి పోతినాయుడు.

♦ ప్రజాసాహితి – డిసెంబర్, 2002 ♦